క్లుప్తంగా

ఒక బస్తా యూరియా మాత్రమే ఇవ్వండి



ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దారు రాజారావు, ఏవో సంగీత

డెంకాడ: ఒక రైతుకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి టి.సంగీత ఆదేశించారు. మండలంలోని చొల్లంగిపేట రైతు సేవా కేంద్రాన్ని తహసీల్దారు రాజారావుతో కలిసి శనివారం సందర్శించిన ఆమె..సిబ్బందికి పలు సూచనలు చేశారు. యూరియా పంపిణీకి సంబంధించి రికార్డు నిర్వహించాలని, యూరియా కోసం వచ్చే రైతుల వన్-బి, ఆధార్‌కార్డు తీసుకుని యూరియా అందివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఏఈవో రామకోటి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతులు



విజేతలకు ప్రశంసాపత్రం, చెక్కులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి స్థానిక వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి చేతులమీదుగా శనివారం బహుమతులు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి టి.అనురాధ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి పి.శ్రీవల్లిక, చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సుజిత్‌చరణ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలవగా వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలోని వీధులు, రోడ్లు, మురుగుకాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ శనివారం చేపట్టారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్ తెలిపారు. దోమకాటు వల్ల ప్రబలే బోదకాలు వ్యాధి నివారణకు న్యూఢిల్లీకి చెందిన పీసీఐ అనే సంస్థ ముందుకువచ్చిందని, గడిచిన రెండేళ్లుగా గ్రామంలోని బోదకాలు వ్యాధిగ్రస్తులపై అధ్యయనం చేస్తున్నారని సభ్యుడు కోరాడ గౌరినాయుడు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వో అనూష, తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘనంగా నివాళులు



సుధాకర్‌రెడ్డికి జోహార్లు చెబుతున్న సీపీఐ నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు శనివారం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు అని ఆ పార్టీ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. చట్టసభల్లో ఆయన ప్రజల గొంతుకై నిలిచారని, ప్రజాసమస్యల పరిష్కారానికి ఆయన అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు.

రక్తదాతలే స్ఫూర్తి



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేంద్రం ఇన్‌చార్జ్ లతక్క, ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రక్తదాతలే రక్తదాన శిబిరాలకు స్ఫూర్తి అని ప్రజాప్రతినిధులు తెలిపారు. గరివిడిలో గల బ్రహ్మకుమారీస్, రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో ఇన్‌చార్జ్ లతక్క ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వాకాడ శ్రీనివాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి కార్తీక్, సారిపాక సురేష్, యువత, నిర్వాహకులు పాల్గొన్నారు.

వినాయక చవితికి.. అనుమతులు తప్పనిసరి!

- గణపతి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి
- నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలు చూడాలి
- నిర్వాహకులు పోలీసుల అనుమతి పొందాలి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు



విగ్రహాల తయారీలో కళాకారుడు

విజయనగరం: ఊరూవాడా వినాయకుడిని కొలువు దీర్చేందుకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు ఆరంభం కానుండడంతో విగ్రహాలు పెట్టాలనుకునే వారంతా పోలీస్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు పొందాలి. అయితే ఉత్సవ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే పని లేకుండానే ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగానే సింగిల్ విండో విధానం ద్వారా అనుమతి పొందే అవకాశాన్ని పోలీస్ శాఖ కల్పిస్తోంది. మొబైల్ నంబర్ పరిశీలన పూర్తయి దరఖాస్తుకు సంబంధించిన విండో తెరుచుకుంటుంది.

పరిశీలన తర్వాతే అనుమతులు..

దరఖాస్తుదారు పేరు, ఈ-మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్ పేరు, గణేశ్ మండపం ఏర్పాటు చేసే స్థలం, కాలనీ, పోలీసు సబ్‌డివిజన్ పేరు, పోలీసుస్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండలం ఎత్తు, ఐదుగురు కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, వినాయక నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జనం చేసే ప్రదేశం, విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇలా వివరాలన్నింటినీ దరఖాస్తులో పొందుపరచాలి. తర్వాత సబ్మిట్ బటన్ నొక్కాలి. ప్రత్యేకంగా ఐడీ వస్తుంది. తర్వాత స్థానిక పోలీసుస్టేషన్ అధికారులు మండపాలను పరిశీలిస్తారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా నిబంధనల ప్రకారం మండపం ఏర్పాటు చేసినట్లయితే వెబ్‌సైట్‌లో ఆమోదిస్తారు. చివరగా క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారు. దానిని విగ్రహం వద్ద ప్రదర్శించారు. ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు వీలుంటుందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

ఇవి కచ్చితంగా పాటించాల్సిందే..

- ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా రహదారి మధ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేయరాదు
- విగ్రహాల వద్ద ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తిపాటలు మాత్రమే పెట్టుకోవాలి. డీజేలు, సినిమా పాటలు నిషేధం
- మండపాల్లో నిరంతరం విధిగా ఒకరు కాపలాగా ఉండాలి. భారీ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- ✔ మండపాలను మండే స్వభావం లేని రేకులతో ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు పడే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- ✔ విగ్రహాన్ని ఉంచేందుకు పటిష్టమైన వేదిక ఉండాలి. విద్యుత్ సరఫరాకు అతుకులు లేని నాణ్యమైన తీగలనే వినియోగించాలి
- ✔ కమిటీ సభ్యులు విగ్రహం పర్యవేక్షణ బాధ్యతలను పిల్లలకు అప్పగించరాదు
- ✔ వాహనాల పార్కింగ్ మండపానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలి
- ✔ నూనె డబ్బాలు, ఇతర మండే స్వభావం కలిగిన వస్తువులను మండపంలో ఉంచరాదు
- ✔ అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలి
- ✔ విగ్రహాల సమీపంలో బాణాసంచా కాల్చరాదు. మండపాల్లో అత్యవసర సేవల నంబర్లు 112, 101తో బోర్డులను ఏర్పాటు చేయాలి.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం కావాలి



నెల్లిమర్ల: ర్యాలీలో నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, కమిషనర్ జయరాం

నెల్లిమర్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ జయరాం సూచించారు. మండల కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం నుంచి రామతీర్థం జంక్షన్ వరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ శనివారం నిర్వహించారు. రోడ్లు, వీధులు, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, కౌన్సిలర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆస్పత్రి ఆవరణలోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రమీలాదేవి, వైద్యుడు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత

విజయనగరం: ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత అని విజయనగరం కార్పొరేషన్ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజారోగ్యంపై అవగాహన కల్పిస్తూ నగరంలో శనివారం ర్యాలీ చేపట్టారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అసిస్టెంట్ కమిషనర్ సూచించారు. విద్యార్థులు భోజనానికి ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

లింగవివక్ష తగదు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవిత

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు సమావేశ మందిరంలో లింగవివక్ష నిర్మూలన, పోక్సో యాక్ట్‌లపై న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భవిత హాజరై కాసేపు ప్రసంగించారు. పని ప్రదేశంలో లింగవివక్ష, లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.విజయకల్యాణి, బి.అప్పలస్వామి, ఎం.పద్మావతి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25న చలో కలెక్టరేట్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎల్బీజీ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆ కార్యక్రమ ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా జిల్లాలో ఐదేళ్ల క్రితం ఏర్పడిన విజయనగరం, రాజాం, గజపతినగరం డిగ్రీ కళాశాలలు దిక్కుమొక్కూ లేకుండా పోయాయన్నారు. పెండింగ్‌లోని రూ.6,500 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి, డిగ్రీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రెండేళ్లుగా స్కాలర్‌షిప్‌లు కూడా విడుదల చేయకపోవడంతో చాలామంది విద్యార్థులు తమ చదువులను ఆపేశారన్నారు. పాదయాత్రలో నారా లోకేష్ జీవో 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చాలన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి సొంత భవనం లేకపోవడంతో గత ఏడేళ్లుగా అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్, శిరీష, జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, కె.రాజు పాల్గొన్నారు.

డీఎస్సీలో 'వినెక్స్'కు ర్యాంకుల పంట



వై.గణేష్



పి.రామలక్ష్మి



ఎస్.శ్యామల



వి.చంద్రకళ



డి.ధనలక్ష్మి



కె.అశ్వని



డి.హరిణి



ఎ.శ్రీనివాసరావు



బి.కుమారి



ర్యాంక్‌లు సాధించిన వారిని అభినందిస్తున్న సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: డీఎస్సీ ఫలితాల్లో విజయనగరానికి చెందిన వినెక్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మెరుగైన మార్కులు సాధించి జిల్లా, పట్టణ స్థాయిల్లో మంచి ర్యాంకులు సాధించారు. ఎస్జీటీ కేటగిరీలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్‌తో పాటు టాప్ 10 ర్యాంకుల్లో ఆరుగురు ఇదే కోచింగ్ సెంటర్ వారు కావడం విశేషం. ర్యాంక్‌లు సాధించిన వారిలో వై.గణేష్(94.5), పి.రామలక్ష్మి(92.8), ఎస్.శ్యామల(92.8), వి.చంద్రకళ(92.2), డి.ధనలక్ష్మి(92.46), కె.అశ్విని(92.13), డి.హరిణి(91.54), ఎ.శ్రీనివాసరావు(91.20), బి.కుమారి(90.144) మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ సారిపల్లి శ్రీనివాసరావు సదరు ర్యాంకర్లను అభినందించారు.

డీఎస్సీ ఫలితాల్లో శ్రీశ్రీ ప్రభంజనం..

విజయనగరం అర్బన్: డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో విజయనగరానికి చెందిన శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించింది. ఈ సంస్థలో శిక్షణ పొందిన వారిలో 224 మంది పోస్టులు సాధించే ర్యాంకులు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ పొట్టా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎస్జీటీలో కె.తులసి(93.21) డి.సంధ్య(92.12), ఎన్.పద్మజ(91.94), ఎం.రామలక్ష్మి(90.70), కె.జగదీష్(90.3) విశేష ప్రతిభ కనబరచగా వారికి సంస్థ తరపున అభినందనలు తెలిపారు.



ఎన్.పద్మజ



ఎం.రామలక్ష్మి



కె.తులసి



కె.జగదీష్



డి.సంధ్య

తెల్లదొరలను హడలెత్తించిన ధీశాలి ప్రకాశం పంతులు

- మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు



విజయనగరం టౌన్: టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ శంకరరావు



విజయనగరం: ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

విజయనగరం టౌన్: తెల్లదొరలను హడలెత్తించిన ధీశాలి, తెలుగుతేజం ప్రకాశం పంతులు అని మాజీ ఎంపీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక గురజాడ పాఠశాలలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘసంస్కర్త టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ 'నాది అనేది నాకు ఉండకూడదు' అనే సిద్ధాంతాన్ని స్వీకరించి ఆ జన్మాంతం నూటికి నూరుపాళ్లు ఆచరించిన కర్మయోగి ప్రకాశం పంతులు అని, ఆయన తన విధి నిర్వహణలో ఎంతటి వారినైనా నిలదీయగల ధీశాలి అని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాటవీధిలోని ఎస్సీ బాలికల వసతిగృహం-3లో జరిగిన కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి డి.రాధామణి టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొని, ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

వర్షాలకు పంటలు దెబ్బతినకుండా చర్యలు



పంటల సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు

విజయనగరంఫోర్ట్: వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు తెలిపారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో పండిస్తున్న పంటలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న పంటల సాగు 75 నుంచి 80 శాతానికి చేరాయన్నారు. వరి సాగులో అధిక దిగుబడులకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాఖ సిబ్బందితో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాత్రో, అనురాధ, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

విజయనగరం అర్బన్: స్థానిక జేఎన్‌టీయూ జీవీలో ఏటీఎల్ మెంటార్‌షిప్ ప్రొగ్రాంపై మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు మాకొద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు మాకు వద్దని నినదిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులంతా స్థానిక ఎల్బీజీ నగర్‌లో శనివారం నిరసన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఓ మాట..ఇప్పుడు మరో మాట చెప్పి ప్రజలను మోసగిస్తోందని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి, ఇప్పుడు అమాంతం పెంచేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల వల్ల ఇప్పటికే కరెంట్ బిల్లులు అధికంగా వస్తుంటే దీనికితోడు కరెంట్ స్మార్ట్‌మీటర్లు తీసుకువచ్చి వినియోగదారులకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్‌మీటర్లను ప్రతిఒక్కరూ ఖండించాలని, ఎవరైనా ఇంటికి బిగించడానికి వస్తే వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు బి.రమణ, రాముడు, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గంలోని మహిళలు, యువత వ్యాపార వాణిజ్య రంగాల్లో రాణించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వయం ఉపాధి వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా వ్యాపారం చేసి ఎదగాలనుకునే వారికి ఈ వర్క్‌షాపు ఎంతగానో ఉపయోగపడుతుందని, నిరుద్యోగ యువతీ యువకులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులకు కోర్టు ఉత్తర్వులు వర్తించవా..?

శృంగవరపుకోట: కలెక్టర్ గారికి కోర్టు ఉత్తర్వులు వర్తించవా..ఆయన చట్టాలకు, కోర్టులకు అతీతులా అంటూ ఎమ్మెల్సీ రఘురాజు ప్రశ్నించారు. శనివారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 60 రోజులకు పైగా జిందాల్ నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్నా కలెక్టర్ గారు బాధితుల గోడు వినేందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఒక బాబా పిలిస్తే పరుగు పరుగున వచ్చి కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో రోడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేసిన కలెక్టర్‌కు నిర్వాసితుల బాధలు పట్టవా అని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగిన నిరసన..

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల నిరసన శనివారం కూడా కొనసాగింది. బొడ్డవర వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరం విజయవంతం

చీపురుపల్లి: పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సేవా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ఎస్.రాఘవులు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని బీకే అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 113 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి శాంతి, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రాఘవులు, అన్నపూర్ణ